ప్రతిభకు 'పద్మా'భివందనం

- ఏడుగురికి పద్మ విభూషణ్, 19 మందికి పద్మ భూషణ్ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- తెలంగాణ నుంచి నాగేశ్వర్ రెడ్డికి పద్మ విభూషణ్, మందకృష్ణకు పద్మ శ్రీ పురస్కారాల ప్రకటన
- వివిధ రంగాల్లో ప్రముఖులైన 113 మందికి పద్మశ్రీ గౌరవం.. తెలుగు రాష్ట్రాల్లో ఏడుగురిని వరించిన 'పద్మ' పురస్కారాలు
- నటులు బాలకృష్ణ, శేఖర్‌కపూర్, శోభన, అజిత్‌కు పద్మభూషణ్

డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి

శేఖర్ కపూర్

బాలకృష్ణ

శోభన

అజిత్

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ), న్యూఢిల్లీ : వివిధ రంగాల్లో విశేష ప్రతిభను కనబరిచిన ప్రతిభామూర్తులు, సామాజిక సేవకులకు కేంద్ర ప్రభుత్వం శనివారం 'పద్మ' పురస్కారాలను ప్రకటించింది. గణతంత్ర దినోత్సవ వేళ కళలు, సామాజిక సేవ, వాణిజ్యం, పరిశ్రమ, సాహిత్యం, విద్య, క్రీడలు, పౌర సేవలు తదితర వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారిని ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలు దక్కాయి. దేశ రెండోఅత్యున్నత పౌర పురస్కారమైన పద్మ విభూషణ్ పురస్కారానికి ఏడుగురు, మూడో అత్యున్నత పురస్కారమైన పద్మభూషణ్‌కు 19 మంది ఎంపికయ్యారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, ఏఐజీ దవాఖానల అధినేత డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్ రెడ్డికి తెలంగాణ నుంచి పద్మ విభూషణ్ పురస్కారం వరించింది. ప్రజావ్యవహారాల రంగంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ వరించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రముఖ నటుడు బాలకృష్ణకు కళల రంగంలో పద్మభూషణ్ ప్రకటించగా, కళల రంగంలో మాడుగుల నాగఫణి శర్మ, మిర్యాల అప్పారావు (మరణానంతరం), సాహితీ రంగంలో వద్దిరాజు రాఘవేంద్రాచార్య పంచముఖి, కేఎల్ కృష్ణకు పురస్కారాలు ప్రకటించారు. తెలంగాణ నుంచి ఇద్దరికి, ఏపీ నుంచి ఐదుగురికి పద్మ పురస్కారాలు లభించాయి. తనకు పద్మవిభూషణ్ పురస్కారం లభించడం పట్ల డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇది తనను నమ్మిన రోగులకు, ఏఐజీ హాస్పిటల్ సిబ్బందికి, ఆరోగ్య రంగంలో పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ దక్కిన గుర్తింపుగా భావిస్తున్నట్టు చెప్పారు.

పద్మ విభూషణ్ పొందిన ప్రముఖులు

దువ్వూరు నాగేశ్వర్‌రెడ్డి(వైద్యం), తెలంగాణ; జస్టిస్(రిటైర్డ్) జగదీశ్ సింగ్ ఖేహర్(రాజకీయ), చండీగఢ్; కుముదినీ రజనీకాంత్ లఖియా(కళలు), గుజరాత్; లక్ష్మీనారాయణ సుబ్రమణియం(కళలు), కర్ణాటక; ఎంటీ వాసుదేవన్ నాయర్(మరణానంతరం)(సాహిత్యం-విద్య), కేరళ; ఒసాము సుజుకీ(మరణానంతరం)(వాణిజ్యం, పరిశ్రమలు), జపాన్; శారదా సిన్హా(మరణానంతరం)(కళలు), బీహార్.

వీరికే పద్మభూషణ్...

ఏ.సూర్యప్రకాశ్(సాహిత్యం, విద్య-జర్నలిజం), కర్ణాటక; అనంతనాగ్(కళలు), కర్ణాటక, బిబేక్ దేబ్రాయ్(మరణానంతరం)(సాహిత్యం, విద్య), ఎన్‌సీటీ ఢిల్లీ; జతిన్ గోస్వామి(కళలు), అస్సాం; జోస్ చాకో పెరియప్పురం(వైద్యం), కేరళ; కైలాష్ నాథ్ దీక్షిత్(పురావస్తు), ఎన్‌సీటీ ఢిల్లీ, మనోహర్ జోషి(మరణానంతరం)(ప్రజావ్యవహారాల),మహారాష్ట్ర; నల్లి కుప్పుస్వామి చెట్టి(వాణిజ్యం, పరిశ్రమలు) తమిళనాడు; నందమూరి బాలకృష్ణ(కళలు), ఏపీ; శ్రీజేష్(క్రీడలు), కేరళ; పంకజ్ పటేల్(వాణిజ్యం), గుజరాత్; పంకజ్ ఉదాస్(కళలు),(మరణానంతరం), మహారాష్ట్ర; రాంబహదూర్ రాయ్(సాహిత్యం, విద్య-జర్నలిజం), ఉత్తర్ ప్రదేశ్; సాధ్వి రితంభర(సామాజిక సేవ), ఉత్తర్ ప్రదేశ్; అజిత్ కుమార్(కళలు), తమిళనాడు, శేఖర్‌కపూర్(కళలు), మహారాష్ట్ర; శోభన (కళలు), తమిళనాడు; సుశీల్ కుమార్ మోదీ(మరణానంతరం), (రాజకీయ), బీహార్; వినోద్ ధామ్((సైన్స్, టెక్నాలజీ), అమెరికా.

ఎండోస్కోపీలో నాగేశ్వర్‌రెడ్డి విశిష్ట సేవలు

దువ్వూరు నాగేశ్వర్‌రెడ్డి ఏపీలోని విశాఖపట్నంలో జన్మించారు. కర్నూల్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, ఛండీగఢ్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీలో పీజీ చేశారు. గ్యాస్ట్రోఎంటరాలజీలో ప్రపంచంలోని అత్యుత్తమ వైద్యుల్లో ఒకరిగా ఆయనకు పేరుంది. 2002లో ఆయనకు పద్మశ్రీ, 2016లో పద్మభూషణ్ పురస్కారాలు లభించాయి. గ్యాస్ట్రో ఎంటరాలజీలో అత్యున్నత పురస్కారాన్ని సైతం ఆయన అందుకున్నారు. 2009లో అమెరికన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ ఎండోస్కోపీ(ఏఎస్‌జీఈ) ఆయనకు మాస్టర్ ఎండోస్కోపిస్ట్ అవార్డును అందించింది. ఎండోస్కోపీ రంగంలో ఈ అవార్డును నోబెల్ బహుమతిగా అభివర్ణిస్తారు. జీర్ణకోశ వ్యాధులపై ఆయన అనేక పరిశోధనలు జరపడంతో పాటు వందలాది ఉపన్యాసాలతో ప్రజలకు అవగాహన కల్పించారు.

దళిత ఉద్యమాలకు మందకృష్ణ నాయకత్వం

నాలుగు దశాబ్దాలుగా దళిత ఉద్యమాల్లో ముందుండి పోరాడుతున్న మంద కృష్ణమాదిగ వరంగల్ జిల్లాలోని శాయంపేటలో జన్మించారు. 1980లలో కులవివక్షకు వ్యతిరేకంగా పోరాటాన్ని మొదలుపెట్టారు. దళిత ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. రిజర్వేషన్లలో మాదిగలకు సరైన వాటా అందాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాలనే డిమాండ్‌తో 1994లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్)ను స్థాపించారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం వందలాది కార్యక్రమాలు, పోరాటాలు చేశారు. ఎస్సీల వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మంద కృష్ణ మాదిగ పోరాటం విజయానికి చేరువైంది.

బాలకృష్ణ నటనలో మేటి.. సేవ, రాజకీయాల్లోనూ రాణింపు

ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చెన్నైలో జన్మించారు. బాల నటుడిగా నట ప్రస్థానం ప్రారంభించిన ఆయన ఇప్పటి వరకు 100కు పైగా సినిమాల్లో నటించారు. అనేక సాంఘిక, పౌరాణిక, ప్రయోగాత్మక సినిమాల్లో విభిన్న పాత్రలు పోషించి టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. ఉత్తమ నటుడిగా మూడుసార్లు నంది అవార్డులు గెలుచుకున్నారు. 2014 నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురం ఎమ్మెల్యేగా ఉన్నారు. హైదరాబాద్‌లోని బసవ తారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్‌కు చైర్మన్‌గానూ వ్యవహరిస్తున్నారు.

అవధానాల్లో దిట్ట..నాగఫణి శర్మ

మాడుగుల నాగఫణి శర్మ అనంతపురం జిల్లా కడవకొల్లు గ్రామంలో జన్మించారు. తిరుపతి రాష్ట్రీయ విద్యా పీఠం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. కొంతకాలం టీటీడీ ధర్మ ప్రచార పరిషత్తు అదనపు కార్యదర్శిగా పనిచేశారు. నాగఫణిశర్మ అవధానాల్లో దిట్ట. ఇద్దరు భారత మాజీ ప్రధానుల సమక్షంలో అవధానాలు నిర్వహించి శభాష్ అనిపించుకున్నారు.

ఎందరో మహానుభావులకు 'పద్మశ్రీ'

పద్మశ్రీ అవార్డులు లభించిన వారిలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఇప్పటి వరకు బయటి ప్రపంచానికి పెద్దగా తెలియని వారు ఎందరో ఉన్నారు. వారిలో గోవా స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న లిబియా లోబో సర్దేశాయ్, లింగ వివక్షతను కాదని పురుషాధిక్యత ఉన్న ధక్ వాద్యంపై 150 మంది మహిళలకు శిక్షణ ఇచ్చిన గోకుల్ చంద్ర దాస్(57) లాంటి వారు ఉన్నారు. మహిళా సాధికారతపై గళమెత్తిన 82 ఏండ్ల సాల్లీహోల్కర్ మధ్యప్రదేశ్‌లోని మహేశ్వర్‌లో చేనేత పాఠశాలను స్థాపించి సంప్రదాయ నేత పనిపై వందలాది మందికి శిక్షణ ఇచ్చారు. ఇక వన్యప్రాణుల పరిశోధకుడు, మరాఠీ రచయిత మారుతీ భుజంగరావు చిటమ్‌పల్లి (92) పక్షులు, జంతువులు, చెట్లపై ప్రత్యేక నిఘంటువును రూపొందించారు. జైపూర్‌కు చెందిన 68 ఏండ్ల భజన కళాకారిణి బతూల్ బేగం ప్యారిస్ టౌన్‌హాల్‌లో ప్రదర్శన ఇచ్చిన ఏకైక రాజస్థాన్ మహిళా కళాకారిణిగా పేరొందారు.డప్పు వాద్యకారుడు వేలు ఆసాన్ (58), తోలు బొమ్మలాట కళాకారిణి భీమవ్వ దొడ్డబలప్ప శిళ్లేక్యాతర (96) కళా రంగానికి విశిష్ట సేవలు అందించారు. సురేందర్ నగర్ పర్మర్‌లో తంగల నేత కార్మికుడు పర్మార్ లావ్జీభాయ్ నాగ్జీభాయ్ (64), పేద క్యాన్సర్ రోగుల కోసం ఉచితంగా సేవలందించిన కలబుర్గికి చెందిన విజయలక్ష్మీ దేశ్‌మానే(కర్ణాట)లను దేశ నాలుగో అత్యున్నత పౌర పురస్కారం వరించింది. మహారాష్ట్రలో 400 హెక్టార్ల అడవిని పరిరక్షించిన చైత్రం దేవ్‌చంద్ పవార్, గిరిజన సంప్రదాయ సంగీత అభివృద్ధితో పాటు వెదురుతో తయారు చేసిన బస్తర్ వేణువు సృష్టికర్త పాండిరామ్ మాండవి కూడా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకోనున్నారు.

భారతీయులుగా గుర్తింపునకు

పునాది రాజ్యాంగమే

- ఆర్థికాభివృద్ధిలో రైతులు, కార్మికుల పాత్ర ప్రశంసనీయమైనది
- గణతంత్ర దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ: భారతీయులుగా మన ఉమ్మడి గుర్తింపునకు బలమైన పునాది వంటిది మన దేశ రాజ్యాంగమని, అది మనందరినీ ఓ కుటుంబంగా కలిపి ఉంచుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మన దేశ 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆమె శనివారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. నైతిక ప్రమాణాలు వేల సంవత్సరాల నుంచి మన ప్రవర్తనలో భాగంగా ఉన్నాయని, అందువల్ల రాజ్యాంగం సజీవ దస్తావేజుగా మారిందని చెప్పారు. భారత దేశ నాగరికత వారసత్వంలో న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం ఎల్లప్పుడూ భాగమేనన్నారు. గడచిన 75 ఏండ్లలో మన ప్రగతికి రాజ్యాంగం బాటలు పరచిందన్నారు. ఈ 75 ఏండ్లలో మన గణతంత్ర దేశానికి లభించిన సర్వతోముఖాభివృద్ధి ఫలాలు రాజ్యాంగానికి అనుబంధంగా వచ్చినవేనని వివరించారు. జమిలి ఎన్నికల వల్ల సుపరిపాలనను పునర్నిర్వచించవచ్చునన్నారు. పాలనలో నిలకడను సాధించవచ్చునని, విధానపరమైన ప్రతిష్టంభనను నిరోధించవచ్చునని, వనరుల దారి మళ్లింపును తగ్గించవచ్చునని చెప్పారు. భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా కొత్త నేర న్యాయ చట్టాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మన దేశ ఆర్థికాభివృద్ధిలో రైతులు, కార్మికుల పాత్ర ఎంతో ఉందని చెప్పారు. ఇటీవలి సంవత్సరాల్లో జరుగుతున్న ఆర్థికాభివృద్ధి వల్ల రైతులు, కార్మికుల ఆదాయం పెరిగిందని రాష్ట్రపతి తెలిపారు.

ఇద్దరికి కీర్తి చక్ర.. 14 మందికి శౌర్యచక్ర

- 942 మందికి పోలీస్ పతకాలు
- అందులో 12 మంది తెలంగాణ రాష్ట్ర వాసులు
- రిపబ్లిక్ డే సందర్భంగా కేంద్ర హోంశాఖ ప్రకటన

దిల్వర్ ఖాన్

మంజిత్

న్యూఢిల్లీ, జనవరి 25: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం పోలీస్, అగ్నిమాపక, పౌర భద్రత రంగాలకు చెందిన 942 మందికి గ్యాలంట్రీ, సర్వీస్ పతకాలు ప్రకటించింది. ఈ పోలీస్ పతకాలు లభించిన వారిలో 12 మంది తెలంగాణ వారు ఉన్నారు. అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం సాయుధ దళాలు, కేంద్ర సాయుధ దళాలకు చెందిన 93 మందికి శౌర్య పురస్కారాలను ప్రకటించారు. అందులో ఇద్దరికి కీర్తి చక్ర 14 శౌర్య చక్ర అవార్డులు ఉన్నాయి. కీర్తి చక్ర అవార్డులు పొందిన వారిలో ద ఆర్టిలరీకి చెందిన నాయక్ దిల్వర్ ఖాన్ (మరణానంతరం), 22 రాష్ట్రీయ రైఫిల్స్ పంజాబ్ రెజిమెంట్‌కు చెందిన మేజర్ మంజిత్ ఉన్నారు. జమ్ము కశ్మీర్‌లో ధైర్య సాహసాలకు వీరికీ అవార్డు దక్కింది.

తెలంగాణ నుంచి 12 మందికి..

పోలీస్ విశిష్ట సేవా పతకాలు దక్కించుకున్న వారిలో 12 మంది తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మన్, ఎస్పీ మెట్టు మాణిక్‌రాజ్ రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలకు ఎంపికయ్యారు.

'పద్మ' పురస్కార గ్రహీతలకు శుభాకాంక్షలు

అణగారిన వర్గాల ధిక్కారానికి ప్రతీకగా నిలిచి, తన రాజీ లేని మనస్తత్వంతో సామాజిక న్యాయ సాధన కోసం అవిశ్రాంతంగా ఉద్యమిస్తున్న పోరాటయోధులు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం ఆయా వర్గాలకు దక్కిన గౌరవం. ఏఐజీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నాగేశ్వరరెడ్డి పద్మవిభూషణ్ అవార్డును అందుకోవడం తెలుగు వారందరికీ గర్వకారణం. వైద్య రంగంలో ఆయన చేస్తున్న కృషి అనితర సాధ్యమైనది. నటుడిగానే కాకుండా, లక్షలాది పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న హీరో నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడం హర్షణీయం. తమ ప్రతిభ, పట్టుదలతో సమాజానికి తమ వంతు సేవ చేస్తున్న ఈ ప్రముఖులను అవార్డులతో గౌరవించుకోవడం అంటే మనల్ని మనం సత్కరించుకోవడమే.

– కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

విభిన్న రంగాల్లో సేవలందించి దేశంలోనే అత్యున్నత పురస్కారాలకు ఎంపికైన వారికి శుభాకాంక్షలు. వైద్య రంగంలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి పద్మవిభూషణ్ పురస్కారం దక్కడం గర్వకారణం. పద్మ భూషణ్‌కు ఎంపికైన బాలకృష్ణ సినీ రంగంలో తనదైన ముద్ర వేయడంతో పాటు బసవతారకం దవాఖాన ద్వారా క్యాన్సర్ రోగులకు సేవలందిస్తున్నారు. పద్మశ్రీకి ఎంపికైన మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ స్థాపించి, అణగారిన వర్గాల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారు. పద్మశ్రీకి ఎంపికైన మాడుగుల నాగఫణి శర్మ తన ప్రవచనాలు, రచనలతో సమాజాన్ని జాగృతం చేస్తున్నారు.

– హరీశ్ రావు, మాజీ మంత్రి

డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి పద్మ విభూషణ్ పురస్కారానికి ఎంపిక కావడం సంతోషకరం. గ్యాస్ట్రోఎంటరాలజీలో ఆయన ప్రజలకు గొప్ప సేవలు అందిస్తున్నారు. పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన మంద కృష్ణ మాదిగకు శుభాకాంక్షలు. ఎమ్మార్పీఎస్ స్థాపించి సామాజిక న్యాయం కోసం ఆయన అలుపెరగని పోరాటం చేస్తున్నారు.

– కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్సీ

తెలంగాణ, ఏపీ నుంచి పద్మ పురస్కారాలకు ఎంపికైన ప్రముఖులకు అభినందనలు.

– రేవంత్ రెడ్డి, సీఎం

నగదు బదిలీ.. ఖజానాకు చిల్లు

- రాష్ట్రాలకు భారంగా మారి దెబ్బ తీస్తున్న ఉచిత పథకాలు
- 8 రాష్ట్రాల్లో రూ.1.5 లక్షల కోట్లు దాటిన ప్రభుత్వ వ్యయం
- ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీల హామీలపై ఎస్‌బీఐ సర్వే
- సార్వత్రిక ఆదాయ బదిలీ పథకం ప్రత్యామ్నాయమని సూచన

న్యూఢిల్లీ, జనవరి 25: ఇటీవలి కాలంలో దేశంలోని పలు రాష్ట్రాల ఎన్నికల్లో మహిళా ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వివిధ రాజకీయ పార్టీలు ఎడాపెడా హామీలను గుమ్మరిస్తున్నాయి. తమను గెలిపిస్తే నేరుగా వారి ఖాతాల్లోకి నగదు జమ చేస్తామంటూ మభ్య పెడుతున్నాయి. ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సైతం ఇదే వాగ్దానం చేసి అధికారం చేపట్టినా తర్వాత ఆ పథకం ఊసే ఎత్తడం లేదు. ఈ క్రమంలో నేరుగా ఖాతాల్లోకి నగదు జమ లాంటి పథకాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతాయని, ఖజానాకు చిల్లులు తప్పవని, నగదు బదిలీ పథకాలు ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బ తీయవచ్చునని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) చేసిన సర్వే హెచ్చరిస్తున్నది. 'ప్రత్యక్ష బదిలీ ప్రయోజనాలను అందించే కొన్ని రాష్ట్రాల్లో (అందులో కొన్ని ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రాజకీయాల కోసం ఉద్దేశించినవి) మహిళా కేంద్రీకృత పథకాల సునామీ ఉంది. అవి ఆ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి' అని నివేదిక పేర్కొంది. దేశంలోని 8 రాష్ట్రాల్లో ఈ పథకాల ఖర్చు 1.5 లక్షల కోట్ల రూపాయలను దాటినట్టు వెల్లడించింది. ఈ మొత్తం ఆయా రాష్ట్రాల ఆదాయంలో 3 నుంచి 11 శాతం ఉందని తెలిపింది.

రాబడిని మింగుతున్నాయి

ఒడిశా లాంటి రాష్ట్రాల్లో పన్నుయేతర ఆదాయాలతో పాటు రుణాలపై ఆంక్షలు లేకపోవడంతో పరిస్థితి బాగానే ఉన్నా మిగిలిన రాష్ట్రాలు తీవ్ర ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవచ్చునని ఎస్‌బీఐ తన నివేదికలో హెచ్చరించింది. ఈ సందర్భంగా కర్ణాటక పరిస్థితిని ఉదహరించింది. ఈ రాష్ట్రంలోని గృహలక్ష్మీ పథకాన్ని తీసుకుంటే దాని కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,000 వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ పథకానికి రూ.28,608 కోట్లను కేటాయించారు. ఇది ఆ రాష్ట్ర రెవెన్యూ రాబడిలో 11 శాతం. ఇంత మొత్తం కేటాయించలేక ఆ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నది, రెవెన్యూ లోటును సవరించడానికి ప్రజలపై వివిధ పన్నుల భారాన్ని మోపుతున్నది.

కేంద్రం పైనా ఒత్తిడి

ఎన్నికల్లో గెలవడానికి రాష్ట్రాలు ఎడాపెడా నగదు బదిలీ పథకాలకు హామీలు గుప్పిస్తుండటంతో కేంద్రంపై కూడా ఒత్తిడి పెరుగుతున్నది. అది కూడా ఇలాంటి పథకాలను అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి మహిళా సాధికారిత పేరుతో నగదు బదిలీ పథకాలు ప్రవేశపెట్టే ముందు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, పార్టీలు ఆ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శక్తి, రుణ లభ్యత, వాటికి కేటాయించాల్సిన బడ్జెట్ మొత్తం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఎస్‌బీఐ నివేదిక సూచిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు సమానమైన గ్రాంట్లతో కూడిన సార్వత్రిక ఆదాయ బదిలీ పథకం ప్రస్తుత విధానానికి మరింత స్థిరమైన ప్రత్యామ్నాయంగా ఉండవచ్చునని ఈ నివేదిక సూచిస్తున్నది. ఇది ఆర్థిక పరిస్థితికి అంతరాయం కలిగించే సబ్సిడీలను కూడా తగ్గించడంలో సహాయపడుతుందని నివేదిక పేర్కొంది.

విద్యార్థి పర్మిట్లను 10% తగ్గించిన కెనడా

వరుసగా రెండో ఏడాదీ కోత

ఒట్టావా, జనవరి 25: కెనడా వరుసగా రెండో ఏడాదీ అంతర్జాతీయ విద్యార్థులకు జారీ చేసే పర్మిట్ల సంఖ్యను తగ్గించనుంది. గృహ, ఆరోగ్యం, ఇతర సేవలు అందించడంలో పాలకులు రాజకీయంగా, ప్రజా బాహుళ్యం నుంచి తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న క్రమంలో దాని నుంచి బయటపడటానికి ఈ చర్య చేపట్టినట్టు స్థానిక వార్తా సంస్థలు తెలిపాయి. ఈ ఏడాది 4,37,000 అంతర్జాతీయ విద్యార్థి పర్మిట్లను జారీ చేయాలని ఆ దేశ వలస శాఖ శుక్రవారం నిర్ణయించింది. 2024తో పోలిస్తే ఇది 10 శాతం తక్కువ. జనాభా సంఖ్య పెరిగిపోవడంతో కెనడాలో ఇండ్ల లభ్యత సమస్య తీవ్రమైంది. 2023లో ఆ దేశం పరిమితికి మించి 6,50,000 విద్యార్థి పర్మిట్లను జారీ చేసింది. దీంతో మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలపై ప్రభావం పడి, దేశ ప్రజల నుంచి ప్రతికూలత రావడంతో ప్రధాని జస్టిన్ ట్రూడో విద్యార్థుల పర్మిట్ల సంఖ్యను తగ్గిస్తూ వస్తున్నారు. విద్యార్థుల పర్మిట్ల జారీకి సంబంధించి నిబంధనలను కూడా కఠినతరం చేశారు.

అమెరికా రక్షణ మంత్రిగా పీట్ హెగ్సెత్

వాషింగ్టన్, జనవరి 25: అమెరికా రక్షణ మంత్రి(డిఫెన్స్ సెక్రటరీ)గా పీట్ హెగ్సెత్ ఎన్నికను అమెరికా సెనేట్ ధృవీకరించింది. రక్షణ మంత్రిగా పీట్ హెగ్సెత్ పేరును అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుగానే ఎంపిక చేసినప్పటికీ లైంగిక దాడి, మద్యపాన వ్యసనం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న హెగ్సెత్ ఎన్నికపై సెనేట్‌లో 50 శాతం అనుకూలంగా, 50 శాతం వ్యతిరేకంగా ఓట్లు పడ్డాయి. ఉపాధ్యక్షుడు జెడీ వాన్స్ తన ఓటును ఉపయోగించుకుని హెగ్సెత్ గెలుపునకు మార్గం సుగమం చేశారు.

డిప్యూటీ ప్రెస్ సెక్రటరీగా కుష్ దేశాయ్

తన డిప్యూటీ ప్రెస్ సెక్రటరీగా ఇండియన్-అమెరికన్ కుష్ దేశాయ్‌ని ట్రంప్ నియమించుకున్నారు. కుష్ గతంలో జర్నలిస్ట్‌గా పని చేశారు. 2024 రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్ డిప్యూటీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా, అయోవా రిపబ్లికన్ పార్టీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా పని చేశారు.

సెక్స్‌కి ఓకే అనడం దాడికి

ఒప్పుకోవడం కాదు

కర్ణాటక హైకోర్టు

బెంగళూరు: ఓ మహిళ వేరొక పురుషునితో శృంగార సంబంధానికి అంగీకరించడాన్ని ఆమెపై దాడి చేయడానికి ఆ పురుషుడికి ఇచ్చిన లైసెన్స్‌గా పరిగణించరాదని కర్ణాటక హైకోర్టు చెప్పింది. ఓ కానిస్టేబుల్ భార్య సామాజిక కార్యకర్తగా పని చేస్తున్నారు. ఆమె 2017లో ఓ కేసు విషయంలో ఇతరులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లినపుడు అక్కడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో ఆమెకు పరిచయమైంది. అనంతరం ఇద్దరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. 2021 మే నెలలో ఆమె సీఐపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై సదరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శారీరక, లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. ఈ కేసును ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో తన పిల్లలను చంపేస్తానని ఆ సీఐ తనను బెదిరించారని ఆమె వెల్లడించారు. దీనిపై ఆమె 2021 సెప్టెంబరులో మరో ఫిర్యాదు చేశారు. సీఐ అదే ఏడాది నవంబర్‌లో తనను ఓ హోటల్‌కు తీసుకెళ్లి, బలవంతంగా లైంగిక దాడి చేసి కొట్టి, తెల్లవారుజామున ఓ బస్టాప్ వద్ద వదిలేశారని ఆమె ఆరోపించారు. ఈ ఆరోపణపై పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడైన సీఐ ఈ ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేశారు. 2017 నుంచి 2022 వరకు తామిద్దరమూ ఇష్టపూర్వకంగా శృంగారం చేశామన్నారు. సీఐ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు చెప్తూ, పిటిషనర్, ఫిర్యాదిదారు ఇష్టపూర్వకంగానే శృంగారంలో పాల్గొన్నారని, పదే పదే అత్యాచారం చేసినట్లు మోపిన నేరారోపణను అంగీకరించలేమని చెప్పింది. అయితే, హత్యాయత్నం, దాడి, నేరపూరిత బెదిరింపులు వంటి ఆరోపణలకు బలం ఉందని, వాటిపై విచారణను కొనసాగించవచ్చునని తెలిపింది. ఫిర్యాదుదారుపై నిందితుడు స్త్రీ ద్వేషంతో కూడిన క్రూరత్వం ప్రదర్శించినట్లు కనిపిస్తున్నదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

సహ జీవనాన్ని క్రమబద్ధీకరించాలి

సహ జీవన సంబంధాలకు సమాజ ఆమోదం లేనప్పటికీ, యువత అటు వైపు ఆకర్షితులవుతున్నందు వల్ల సమాజంలో నైతిక విలువలను కాపాడటం కోసం ఓ క్రమబద్ధమైన విధానాన్ని, పరిష్కారాన్ని కనుక్కోవాల్సిన సమయం వచ్చిందని అలహాబాద్ హైకోర్టు చెప్పింది. స్త్రీ, పురుషులు తమ భాగస్వామి పట్ల బాధ్యతను తప్పించుకోవడం కోసం ఇలాంటి సంబంధాల వైపు మొగ్గు చూపడం పెరుగుతున్నదని తెలిపింది. పెండ్లి పేరుతో ఓ మహిళతో శారీరక సంబంధాలు ఏర్పాటు చేసుకున్నారనే ఆరోపణపై ఆకాశ్ కేసరి అనే వ్యక్తిపై కేసు నమోదైంది. ఆయనకు బెయిలు మంజూరు చేస్తూ హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కేసరి తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ, ఆరోపణలు చేసిన మహిళను పెండ్లి చేసుకుంటానని కేసరి చెప్పలేదన్నారు.

విదేశీ పర్యటన రాజ్యాంగ హక్కు

- ఈడీకి ఢిల్లీ కోర్టు స్పష్టీకరణ
- ఎల్‌వోసీ సస్పెన్షన్‌కు ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 25: భారత్‌లోని ప్రతి పౌరునికి విదేశాల్లో పర్యటించే స్వేచ్ఛ ఉన్నదని, అది రాజ్యాంగం కల్పించిన హక్కని ఢిల్లీ కోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. మనీ లాండరింగ్ కేసులో క్వాలిటీ లిమిటెడ్ కంపెనీ మాజీ ప్రమోటర్ సిద్ధాంత్ గుప్తాకు వ్యతిరేకంగా జారీ చేసిన లుకౌట్ సర్క్యులర్ (ఎల్‌వోసీ)ని సస్పెండ్ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని ఆదేశించింది. తనపై ఉన్న ఎల్‌వోసీని సస్పెండ్ చేసేలా ఈడీని ఆదేశించాలని, తద్వారా తన కూతురిని సింగపూర్‌కు తీసుకెళ్లి అక్కడ ఆమె ఉన్నత విద్యాభ్యాసానికి అవసరమైన ఏర్పాట్లు చేసే నిమిత్తం ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 8 వరకు ఆ దేశంలో పర్యటించేందుకు వీలు కల్పించాలని సిద్ధాంత్ గుప్తా పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని విచారణకు స్వీకరించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి అంజూ బజాజ్ చందన.. విదేశాల్లో పర్యటించడం సహా స్వేచ్ఛగా సంచరించే హక్కు పిటిషనర్‌కు ఉన్నదని, అది రాజ్యాంగం కల్పించిన హక్కని తెలిపారు. నిర్దిష్ట అవసరం కోసం పరిమిత కాలంపాటు విదేశంలో పర్యటించేందుకు పిటిషనర్ అనుమతి కోరుతున్నందున ఆయనపై ఉన్న ఎల్‌వోసీని సస్పెండ్ చేసి, విదేశీ పర్యటనకు అనుమతించడంలో ఈడీ ఎలాంటి పక్షపాతం లేకుండా వ్యవహరించాలని ఉత్తర్వులు జారీ చేశారు



సాహిత్య పరిశోధకులు వెంకటసుబ్బా రావు

కన్నుమూత

బెంగళూరు, జనవరి 25: జానపద సాహిత్య పరిశోధకులు, సాహితీవేత్త ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు(90) కన్నుమూశారు. శనివారం బెంగళూరులో తుదిశ్వాస విడిచారు. 1935లో పశ్చిమ గోదావరి జిల్లా కాకుల ఇల్లిందలపర్రులో జన్మించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ చదివారు. బెంగళూరు విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయన శాఖాధ్యక్షులుగా పని చేశారు. శ్రీకృష్ణ దేవ రాయ రస సమాఖ్యను స్థాపించారు.

గ్రీన్‌లాండ్ కోసం డెన్మార్క్ ప్రధానికి

బెదిరింపులు

ఆ దేశాన్ని సుంకాలతో శిక్షిస్తానన్న ట్రంప్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన కొన్ని రోజులకే డొనాల్డ్ ట్రంప్.. ఇతర దేశాలపై బల ప్రదర్శనకు దిగుతున్నారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడెరిక్సన్‌పై ట్రంప్ బెదిరింపులకు పాల్పడ్డాడని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. డెన్మార్క్‌ను సుంకాలతో శిక్షిస్తానని ట్రంప్ ఫోన్‌కాల్‌లో హెచ్చరించినట్టు ఆ కథనం పేర్కొన్నది. ఇటీవల వీరిద్దరి మధ్య 45 నిమిషాలపాటు సాగిన ఫోన్ కాల్ సంభాషణలో అధ్యక్షుడు ట్రంప్ తన అభిప్రాయాలను ఘాటైన స్వరంతో వినిపించారని సంబంధిత అధికారులు చెబుతున్నారు. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ మాటల్ని డెన్మార్క్ ప్రధాని తోసిపుచ్చుటంతో, ట్రంప్ మాటల ధోరణి వేరే విధంగా మారిందని, ఒక దశలో బెదిరింపులకు పాల్పడ్డారని ఆ అధికారులు పేర్కొన్నారు. ఇద్దరి మధ్యా వాగ్వాదం కూడా చోటుచేసుకుందని, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునే విషయంలో తాము సీరియస్‌గా ఉన్నామని ట్రంప్ చెప్పినట్టు సమాచారం. అయితే దానిని అమ్మడంపై తమకు ఎలాంటి ఆసక్తి లేదని డెన్మార్క్ ప్రధాని సమాధానమిచ్చారట. ఫోన్‌కాల్‌లో ట్రంప్ సంభాషించిన తీరుకు తాము దిగ్భ్రాంతికి గురయ్యామని అధికారులు వెల్లడించారు. డెన్మార్క్ తిరస్కరణతో అమెరికా నుంచి ప్రతీకార చర్యలు ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

మోదీ హయాంలోనే రూపాయి ఎక్కువగా కుదేలు!

కాంగ్రెస్ ట్వీట్

న్యూఢిల్లీ, జనవరి 25: నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలోనే రూపాయి విలువ అత్యధికంగా క్షీణించిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఏ ప్రధాని పదవీ కాలంలో రూపాయి విలువ ఎంత మేరకు తగ్గిపోయిందో చెప్తూ కాంగ్రెస్ శనివారం ఒక ట్వీట్ చేసింది. దాని ప్రకారం నరేంద్ర మోదీ పాలనలో రూపాయి విలువ 34.20 శాతం తగ్గిపోయింది. అంతకుముందు మన్మోహన్ సింగ్ హయాంలో మన కరెన్సీ విలువ 15.56 శాతం తగ్గిందని తెలిపింది. ఇప్పటివరకు పని చేసిన ప్రధానుల్లో మోదీ హయాంలోనే రూపాయి విలువ అత్యధికంగా తగ్గిపోయిందని కాంగ్రెస్ ప్రతినిధి సుప్రియా శ్రీనేట్ విమర్శించారు.

విశ్వాసం లేని నేత రాహుల్

ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ పోస్టర్ ప్రచారం

న్యూఢిల్లీ, జనవరి 25: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ముంచుకొస్తున్న నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) శనివారం తన ప్రధాన ప్రత్యర్థులు కాంగ్రెస్, బీజేపీలను లక్ష్యంగా చేసుకుని పోస్టర్ యుద్ధాన్ని ఉధృతం చేసింది. ఆప్ చేపట్టిన పోస్టర్ ప్రచార పోరులో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మొట్టమొదటిసారి ప్రముఖస్థానాన్ని దక్కించుకున్నారు. కేజ్రీవాల్ పార్టీ నిజాయితీ విశ్వాసం లేని వ్యక్తులందరినీ ఓడిస్తుంది అన్న శీర్షికతో ఆప్ రూపొందించిన పోస్టర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, యూపీ సీఎంయోగి తదితరుల ఫోటోలు ఉన్నాయి. అయితే రాహుల్ ఫోటో కూడా ఈ పోస్టర్‌లో ఉండడంతో కాంగ్రెస్‌తో ఆప్ పూర్తి స్థాయి యుద్ధానికి దిగినట్టుగా భావిస్తున్నారు.